క్లుప్తంగా

నేడు సమావేశం

పెంచికల్‌పేట్: ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులతో శనివారం మధ్యాహ్నం 2గంటలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వినేష్, ఉపాధ్యక్షులుగా అరుణ, కోశాధికారిగా క్రిష్ణకుమార్, కార్యదర్శులుగా షబ్నాం, దివ్య జ్యోతి, అడిట్ కమిటీ కోకన్వీనర్‌గా దివ్య జ్యోతి, సోషల్ మీడియా కన్వీనర్‌గా సతీష్, అకాడమిక్ కన్వీనర్‌గా ప్రశాంత్, మహిళా కమిటీ కన్వీనర్‌గా ప్రియాంక, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా రేవతి, వాయిస్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్‌గా లచన్నలను ఎన్నుకున్నారు.

'22న సెలవు ప్రకటించాలి'

ఆసిఫాబాద్: అయోధ్య రామజన్మభూమి ప్రారంభోత్సవం పురస్కరించుకొని ఈ నెల 22న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించాలని కిరాణా మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు, వైశ్య ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గుండ ప్రమోద్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలు సెలవు ప్రకటించాయన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: ఈనెల 22న రాష్ట్రంలోని విద్యాసంస్థలకు సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయోధ్యలో జరిగే శ్రీ రామ విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన దృశ్యాలను లైవ్‌లో వీక్షించేలా, ప్రతీ ఆలయంలో జరిగే ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

నేడు ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయం శుద్ధి

కాగజ్‌నగర్‌రూరల్: అయోధ్య రామయ్య విగ్రహ ప్రతిష్ఠ క్రతువు సందర్భంగా శనివారం మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయాన్ని శుద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆలయాన్ని శనివారం ఉదయం 6 గంటలకు శుద్ధి చేస్తామని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని రాస్పెల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సాయిచరణ్ అన్నారు. శనివారం మండలంలోని మోసం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఏపీఎం ముక్తేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, సర్పంచ్ పురుషోత్తం, సీసీ సుజాత పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఆహ్వానం

జైనూర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆత్రం అర్జున్ అన్నారు. శుక్రవారం జామిని ఎంపీటీసీ లటపటే మాధవ్‌కు క్రీడా పోటీల ఆహ్వానపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ అయోధ్యలో శ్రీ రాములోరి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకొని మండలంలోని రాసిమెట్ట గ్రామంలో ఈనెల 23వ తేదీన వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 7285924609, 7207530206లలో సంప్రదించాలన్నారు.

డిగ్రీ తరగతులు ప్రారంభం

కాగజ్‌నగర్‌టౌన్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో రెగ్యులర్‌గా డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు ఈనెల 19 నుంచి తరగతులు ప్రారంభమైనట్లు కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1 నుంచి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ పరిశీలించారు. నీటి కుంటలు, నర్సరీలను పరిశీలించి పనులు సక్రమంగా చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

భీమయ్యక్ ఆలయాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ఘనంగా దంతన్‌పల్లి భీమయ్యక్ జాతర
- భారీగా తరలివచ్చిన జనం



భీమయ్యక్‌కు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జాతరకు తరలివచ్చిన ప్రజలు

తిర్యాణి: భీమయ్యక్ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని దంతన్‌పల్లి గ్రామ శివారులో నిర్వహించిన భీమయ్యక్ జాతరకు హాజరై ఆలయంలో సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన దర్బార్‌లో ఆమె మాట్లాడుతూ ఆదివాసీలు తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. దేవాలయ ఆవరణలో హైమస్ లైట్లతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. అంతకుముందు రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ కుమ్ర ఈశ్వరీబాయి భీమయ్యక్‌కు ప్రత్యేక పూజలు చేశారు. డీటీడబ్ల్యూవో రమాదేవి, పీటీజీ ఏపీవో భాస్కర్, ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి, జాతర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆత్రం గంగారాం, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆత్రం లక్ష్మణ్, సీఐ అల్లం నరేందర్, ఎస్సై చుంచు రమేశ్, కొలం సంఘం నాయకులు సిడాం అన్నిగా, ఆత్రం భీంరావు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తరలివచ్చిన భక్తులు

మూడు రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా రెండవ రోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘఢ్‌ల నుంచి ఆదివాసీలు తరలివచ్చి దేవునికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర సందర్భంగా భక్తులు కోళ్లు, మేకలను బలిచ్చారు. నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో వాంకిడి మండలం సవతి గ్రామానికి చెందిన జట్టు మొదటి స్థానం, గుడిపెట గ్రామానికి చెందిన జట్టు రెండో స్థానంలో నిలిచాయి. కబడ్డీలో దంతన్‌పల్లి జట్టు మొదటి స్థానం, అంకిత్ జట్టు రెండో స్థానంలో నిలిచాయి. అనంతరం విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. జాతర సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

గాంధీ వేషధారణలో ధానరావు..



గాంధీ వేషధారణలో ధానరావు

జాతరలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ధానరావు గాంధీ వేషధారణతో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాడు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు జనాలు పోటీపడ్డారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల పదోన్నతి పొందిన పోలీసు సిబ్బంది మరింత బాధ్యత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో జిల్లా పరిధిలో ఇటీవల ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన రమేశ్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, సాయిబాబా, వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ముక్తర్ బేగ్, గణేశ్‌కుమార్, పోచయ్య, దత్త, మహమ్మద్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు నీతి, నిజాయితీతో పనిచేసి జిల్లాకు, పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్, డీపీవో ఏవో శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్, రాణాప్రతాప్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ పెద్దన్న, సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

దహెగాం: దహెగాం –కాగజ్‌నగర్ రూట్‌లో ఆర్టీసీ బస్సు సేవలు లేకపోవడంతో మండల వాసులు పడుతున్న ఇబ్బందులపై సాక్షిలో 'ఉచిత ప్రయాణ భాగ్యం లేనట్టేనా..?' శీర్షికన కథనం ప్రచురితం కాగా స్పందన లభించింది. ఎట్టకేలకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కథనానికి స్పందించి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి దహెగాంకు ఆర్టీసీ బస్సును శుక్రవారం ప్రారంభించారు. బస్సు మండల కేంద్రానికి రావడంతో బీజేపీ నాయకులు బస్సుకు పూజలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, ఎంపీటీసీ రాపర్తి జయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, ఓబీసీ మోర్చా నాయకులు పుల్గం నారాయణ, నాయకులు పదాల సురేశ్, ప్రదీప్, తోట చందు, బావాజీ, రాపర్తి రమేశ్, తిమ్మెడె సురేశ్, దెబ్బటి సత్యనారాయణ పాల్గొన్నారు.



బస్సుకు పూజలు చేస్తున్న స్థానికులు

అటవీ సంరక్షణలో భాగస్వాములవ్వాలి

వాంకిడి: అటవీ సంరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములవ్వాలని ఆసిఫాబాద్ రేంజ్ అధికారి అప్పలకొండ అన్నారు. శుక్రవారం మండలంలోని రింగారేట్ గ్రామంలో పులుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పులులు, ఇతర వన్య మృగాలు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం పంట చేలల్లో పర్యటించి విద్యుత్‌లైన్‌లు పరిశీలించారు. అక్రమంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసుకోవద్దని రైతులకు సూచించారు. జంతువుల వేటకు అడవిలో ఉచ్చులు పెట్టడం, విద్యుత్ తీగలు అమర్చడం, విష ప్రయోగాలు చేయడం సరికాదన్నారు. పులుల కదలికలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో అత్తరుద్దిన్, ఎఫ్‌బీవో సాధిక్ ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏఐటీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌అర్బన్: ఏఐటీయూసీ నూతన డైరీ, క్యాలెండర్‌లను శుక్రవారం జిల్లా కేంద్రంలో అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావ్, సీఐ రాణాప్రతాప్‌లు ఆవిష్కరించారు. ఏఐటీయూసీ నాయకులు అదనపు ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, అధ్యక్షులు దివాకర్, నాయకులు మోహన్‌బాబు, షఫీతో పాటు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అదనపు ఎస్పీ

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: ఆసిఫాబాద్ రేంజ్ పరిధి చిర్రకుంట సెక్షన్‌లో అటవీ అధికారులు శుక్రవారం అక్రమ కలప పట్టుకున్నారు. రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం ముందస్తు సమాచారం మేరకు సెక్షన్ అధికారి సాయి చరణ్ తన బృందంతో మండలంలోని భవానినగర్ నుంచి అక్రమంగా వాహనంలో 12 కలప దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో బీట్ అధికారి శ్రీనివాస్, రాజేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న కలపతో అధికారులు

ఓటు నమోదుకు మరో అవకాశం



ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

- నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు
- 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు

కౌటాల: ఎంపీ ఎన్నికలతో పాటు సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలోని కొత్త ఓటర్ల నమోదుకు అధికారులు శనివారం, ఆదివారంలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఓటు హక్కు కోసం అర్హులైన వారి నుంచి ఎన్నికల సంఘం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

జిల్లా ఓటర్లు 4,55,599..

జిల్లాలో సిర్పూర్(టి), ఆసిఫాబాద్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 4,55,599 మంది ఓటర్లు ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో 1,14,668 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,13,668 మహిళ ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పురుషులు 1,13,199 కాగా మహిళా ఓటర్లు 1,14,036 ఉన్నారు. ఈ నెల 6న ముసాయిదా జాబితాలను జిల్లాలోని 597 పోలింగ్ కేంద్రాలతో పాటు 15 మండలాల తహసీల్దార్ కార్యాలయాలు, రెండు ఆర్డీవో కార్యాలయాల్లో ప్రదర్శించారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబర్ 10న ఎన్నికల సంఘం తుది జాబితాను విడుదల చేసింది. ఆ జాబితాలో జిల్లా మొత్తం ఓటర్ల సంఖ్య 4,53,538గా లెక్క తేలింది. నవంబర్‌లో విడుదల చేసిన తుది జాబితాతో పోలిస్తే ప్రస్తుత ముసాయిదా ఓటరు జాబితాలో కొత్తగా 2,061 మంది ఓటర్లు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. సుమారు 56 రోజుల్లో కొత్తగా రెండు వేలకు పైగా ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

ఓటు నమోదు కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేయనున్నారు. రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారు. కొత్తగా ఓటు నమోదుతో పాటు పేర్లు, చిరునామా ఇతర వివరాల సవరణకు కూడా అవకాశం కల్పించనున్నారు. ఆన్‌లైన్‌లో ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా కూడా ఓటు నమోద చేసుకోవచ్చు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

దహెగాం: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కవిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01 -01 -2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. శనివారం, ఆదివారం రెండు రోజులు ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారాలు అందుబాటులో ఉంచాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదు, ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా తదితర సవరణలు చేసుకోవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హులు ఓటు హక్కు కలిగి ఉండాలి

రెబ్బెన: మండలంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ సమీర్ హైమద్ అన్నారు. ఎన్నికల సంఘం ఓటు హక్కు నమోదుకు మరోసారి అవకాశం కల్పించిందని శని, ఆదివారాలు రెండు రోజుల పాటు స్పెషల్ కాంపెయిన్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ తనిఖీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సిర్పూర్(టి) –మాకిడి అంతర్రాష్ట్ర రహదారిపై ఉన్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును శుక్రవారం డీఎం గజానాన్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా తనిఖీలు చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ చెక్‌పోస్ట్‌లో పత్తి వ్యాపారులు, ధాన్యం అమ్మకందారులు తప్పనిసరిగా టాక్స్ చెల్లించాలన్నారు. రికార్డులలో సక్రమంగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏడీఎం శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

'సమాజ హితమే ప్రధాన లక్ష్యం'

కాగజ్‌నగర్‌టౌన్: సమాజ హితం కోసం జమాతే ఇస్లామి హింద్ (జేఐహెచ్) తరచూ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పిస్తుందని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎండీ ఖాలిద్ ముబష్షిర్ ఉజ్ జఫర్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లోని జమాతే ఇస్లామి ఆధ్వర్యంలో నిర్వహించే పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి కాగజ్‌నగర్ చేరుకున్న ఆయన స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జామతే ఇస్లామి హింద్ పదాధికారులు ఎండీ అఖిల్, అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని శివలింగాపూర్ గ్రామంలో యువతకు వాలీబాల్ కిట్ అందించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలన్నారు.

అక్షింతల పంపిణీ

జైనూర్: మండలంలోని రాంనాయక్ తండా పరిధి కేవశాగూడలో శుక్రవారం విశ్వ హిందూ పరిషత్ నాయకులు గ్రామస్తులతో కలిసి శ్రీ రాములోరి అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. ధర్మపాల్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌక్‌లో శుక్రవారం శ్రీ అయోధ్య రామ మందిరం విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్ల వితరణ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోలపై విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పోస్టర్లను అంటించారు.

పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నేడు నిర్వహించే నవోదయ ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు.

నేడు హెచ్ఎంలకు సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అన్ని యాజమాన్యాల కింద పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

డైరీ ఆవిష్కరించిన డీఈవో

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని డీఈవో అశోక్ అన్నారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో సంఘం నాయకులతో కలిసి పీఆర్‌టీయూటీఎస్ డైరీ ఆవిష్కరించారు. డీఈవో మాట్లాడుతూ రానున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, ప్రకాశ్, నాయకులు ఉదయ్ బాబు, గోవింద్, శంకర్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

'శివగూడ' సమస్యలు పరిష్కరించండి

కెరమెరి: మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధి శివగూడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామ పటేల్ టేకం మానిక్ రావు అధికారులను కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. గ్రామంలో 15 కుటుంబాలు ఉన్నాయని విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. సాగు భూములకు నీటి వసతి కోసం పొలాల్లో బోర్లు మంజూరు చేయాలని, కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. టేకం భాలేరావు, జీవన్, రాజు, భీము, సోము, భీంరావు తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరి

కౌటాల: గ్రామాభివృద్ధికి ప్రణాళికలు తప్పనిసరని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో అన్ని శాఖల అధికారులు పనుల గురించి చర్చించి పరిష్కరించాలన్నారు. సర్పంచ్ వొజ్జల మౌనిశ్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, ఉప సర్పంచ్ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు చందు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రత్యేక ప్రణాళికలతో గ్రామపంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని గోలేటి సర్పంచ్ పోటు సుమలత అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో జీపీడీపీ ప్లానింగ్‌లో భాగంగా గ్రామసభ నిర్వహించారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ప్రణాళికలు తయారు చేసి తీర్మానాలు చేశారు.

యువత సన్మార్గంలో నడవాలి

కెరమెరి: యువత సన్మార్గంలో నడవాలని నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ సునీల్ భాటియా అన్నారు. మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శ్రీ చైతన్య యువజన సంఘం కార్యక్రమాలను అభినందించారు. యువజన సంఘం నాయకుడు కాత్లె జంగును శాలువాతో సన్మానించి మెమొంటో అందించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కుమురం న్యానేశ్వర్, సుర్దాపూర్ సర్పంచ్ గేడాం సోము, గ్రామస్తులు ఆత్రం బొజ్జిరావు, కుసుంబ్‌రావు, వసంత్ రావు, తుకారాం, సాగర్, రాము తదితరులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రాంతాల్లో షీటీం పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. షీటీం కాగజ్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు షీటీం సేవలు, ఫోన్ నంబర్లు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

పీవీటీజీ గ్రామాల్లో వైద్య శిబిరాలు

వాంకిడి: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పీవీటీజీ(కొలాం) గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని సడక్‌గూడ, చౌపన్‌గూడ గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. ఈ నెల 19 నుంచి 31 వరకు నిర్వహించే పీఎం జన్‌మన్ కార్యక్రమంలో సికిల్‌సెల్, టీబీ, కుష్ఠు, డెంగీ, బీపీ వంటి వ్యాధులకు పరీక్షలు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. వైద్యుడు నాగరాజ్, హెచ్ఈవో రవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు సముచిత గౌరవం దక్కాలి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: క్రీడాకారులకు సముచిత గౌరవం దక్కాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని ఈజ్‌గాం గ్రామం నంబర్ 13లో శుక్రవారం సాయంత్రం ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తం రావు స్మారక క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విన్నర్‌గా విలేజ్ నంబర్ 13 టీం, రన్నరప్‌గా విలేజ్ నంబర్ -2 టీంలు నిలిచాయి.